క్వాలిటీ చెక్ చేశాకే..

బిల్లుల మంజూరు

- అధికారులు స్వేచ్ఛగా పనిచేసి ఖమ్మాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలి
- కార్పొరేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నిలిచిపోయిన పనులను, సగం పూర్తయిన పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలను చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. పూర్తయిన పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ విభాగం పరిశీలించిన తరువాతనే బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజలకు శానిటేషన్, తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మానికి ఔటర్ రింగురోడ్డు వచ్చేలా నాలుగువైపులా జాతీయ రహదారులను ప్రతిపాదించామన్నారు. లకారం, ఖానాపురం, మున్నేరు, ధంసలాపురం వద్ద బఫర్‌జోన్ డీమార్కు చేసి నిర్మాణాలు చేపట్టకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్ల విస్తరణతో నగరం సుందరీకరణ అవుతుందనీ, రాబోయే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడ రోడ్ల విస్తరణ ఆవశ్యకత ఉందో పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. సుడా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు మార్పులపై చర్చించారు. ఇల్లెందు క్రాస్‌రోడ్, ముస్తఫానగర్ ప్రాంతాలను కమర్షియల్ కేటగిరీలనుంచి రెసిడెన్షియల్ కేటగిరీలుగా మార్చడంతో పాటు ప్రకాష్‌నగర్ నుంచి ధంసలాపురం రోడ్, గోళ్లపాడు ఛానల్ అభివృద్ధి, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్ ప్రాంతాల్లో మున్నేరు నుంచి 50మీటర్ల బఫర్‌జోన్‌ల ఏర్పాటుకు ఆలోచన చేయాలన్నారు. అధికారులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా పనిచేయాలని, నిబద్ధతతో నగర అభివృద్ధిపై దృష్టిపెట్టి నగరానికి మంచిపేరు తీసుకురావాలని మంత్రి సూచించారు.

వినోద ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

వినోద ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేసి నివేదికలు సమర్పిస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకొస్తానని మంత్రి తుమ్మల తెలిపారు. సంబంధిత ప్రాజెక్టుల ద్వారా కల్పించే వినోదానికి ట్యాక్స్ వసూలు చేయాలని, తద్వారా ఆయా ప్రాజెక్టులు అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మంనగరాన్ని శానిటేషన్, ప్లానింగ్, టౌన్‌ప్లానింగ్ వంటి అన్ని విభాగాల్లో మోడల్‌గా నిలిపేలా అధికారులు కృషి చేయాలన్నారు. వేసవిలో నగరంలో ఏ ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించి పరిశుద్ధ ఖమ్మంగా గుర్తింపు తేవాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఈ సంవత్సరం పలు గ్రాంట్ల కింద రూ.113.24 కోట్లతో 574 పనులు చేపట్టామని, అందులో 488 పనులు పూర్తి కాగా, 19 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 67 పనులు ఇంకా ప్రారంభించలేదని మంత్రి తెలిపారు. పూర్తయిన పనులకు ఇప్పటివరకు రూ.24.72 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. సుడా ద్వారా రూ.45.7లక్షలతో 48పనులు మంజూరుకాగా, 38 పనులు పూర్తయ్యాయని, వాటికి రూ.28.89 కోట్లు ఖర్చు చేయగా ఇంకా రూ.5.61 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. పబ్లిక్‌హెల్త్ విభాగం ద్వారా ఈ సంవత్సరం మొత్తం 13పనులకు డీఎంఎఫ్టీ కింద రూ.10కోట్లు, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.2కోట్లు, 15వ ఆర్థిక సంఘం టైడ్ ద్వారా రూ.3.70కోట్లు మంజూరు కాగా వాటిలో 3 పనులు పూర్తికాగా రెండు పనులు పురోగతిలో ఉండగా ఇంకా 8 పనులు ప్రారంభంకాలేదన్నారు. గత ఐదేళ్లలో పన్నుల ద్వారా రూ.110.53 కోట్లు, అద్దెల ద్వారా రూ.3.78కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.5.10కోట్లు, టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ అనుమతుల ద్వారా రూ.92.56కోట్లు, ట్రేడ్ లైసెన్సుల ద్వారా రూ.3కోట్లు, పట్టణ ప్రగతి గ్రాంట్లు రూ.55 కోట్లు, ఇతర గ్రాంట్ల ద్వారా రూ.122.84 కోట్లు, నీటి పన్నుద్వారా రూ.13.01కోట్లు మొత్తంగా రూ.405.82 కోట్లు రెవెన్యూ వచ్చినట్టు మంత్రి తెలిపారు. 2023-24 సంవత్సరానికి రూ.398.40 కోట్లు పన్ను వసూలు డిమాండ్ ఉండగా ఇప్పటివరకు రూ.175కోట్ల వసూలైనట్టు తెలిపారు. పక్కా ప్రణాళికతో 100 శాతం వసూళ్లు చేయాలన్నారు. కాగా మంత్రి తుమ్మల తొలిసారి ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షకు హాజరైన సందర్భంగా కమిషనర్ ఆదర్శ్‌సురభి మంత్రికి మొక్కను అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సమీక్షలో ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల

ఆక్రమిత ప్రభుత్వ స్థలాలు వెనక్కి

- అక్రమ క్రమబద్ధీకరణలపై విచారణ
- దొంగ అసెస్‌మెంట్లకు పాల్పడినవారిపై చర్యలు
- తుమ్మల సమీక్షతో ప్రక్షాళన దిశగా ఖమ్మం కార్పొరేషన్
- చర్చనీయాంశంగా మారిన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఖమ్మం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి తిరిగి ప్రభుత్వానికి దాఖలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సమీక్షలో భాగంగా పలు అభివృద్ధి అంశాలపై చర్చించిన ఆయన అక్కడ జరుగుతున్న అవినీతి అక్రమాలపై కూడా చర్యలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ కార్యాలయ వేదికగా జరుగుతున్న అవినీతి తంతుపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అవినీతి అడ్డా' శీర్షికన ప్రచురితమైన కథనం చర్చనీయాంశం కాగా.. సదరు కథనంలో పేర్కొన్న పలు అంశాలపై సమీక్షలో మంత్రి చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వ స్థలాలు, ఆక్రమణకు గురైన స్థలాలు, ఎన్నెస్పీ స్థలాలు ఎక్కడ ఎంత మేర ఉన్నాయో నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించడంతోపాటు, ప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చిన చోట, పట్టాలు పొందిన వారే ఉంటున్నారా ? అమ్మకాలు జరిగాయా వంటి అంశాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. ప్రైవేటువ్యక్తులకు సంబంధించి దురాక్రమణకు గురైన భూములను రక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే 58, 59జీవోల పేరుతో అక్రమంగా క్రమబద్ధీకరణ జరిగిన స్థలాలపై విచారణ జరుగుతున్నట్టు ఆయన ప్రస్తావించినట్టు సమాచారం. దొంగ అసెస్‌మెంట్లకు సంబంధించి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఆదేశించినట్టు చర్చ జరుగుతోంది. ఒకచోట్ల నిర్మాణాలను అనుమతులు తీసుకుని మరో ప్రాంతంలో నిర్మాణాలు చేస్తుంటే ఏం చేస్తున్నారనీ అధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. వాటితోపాటు గతంలో ఇష్టారీతిగా చేపట్టిన అవుట్‌సోర్సింగ్ నియామకాలపై కూడా విచారణ నిర్వహించాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. దాంతో అక్రమాలకు పాల్పడిన, అవసరంలేని, విధులకు హాజరుకాని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటుపడే అవకాశం కనిపిస్తోంది. మంత్రి తుమ్మల చేపట్టిన సమీక్షతో కార్పొరేషన్ కార్యాలయంలో ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నట్టు తెలుస్తోంది. అయితే అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు తిరిగి అదే కార్యాలయంలో విధులు నిర్వర్తించేలా పైరవీలు చేసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మళ్లీ మార్చిలో వస్తా

- మీలో సంపూర్ణ మార్పులు రావాలి
- రైతులకు, వినియోగదారులకు ఇబ్బందులు రావొద్దు
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- ఏఈల వారీగా నాలుగు గంటల పాటు సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 23: "మీ పనితీరు గురించి నేను పూర్తి వివరాలు తెలుసుకోవటం ఐదు నిమిషాల పని.. ఎస్‌బీ, ఐబీ నుంచి అందరి పనితీరు తెలుస్తుంది.. ఇంతవరకే నా పని అని కాకుండా సమన్వయంతో అన్ని విద్యుత్ విభాగాలు కలిసి ఉమ్మడిగా పనిచేసి రైతులకు, విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు రాకుండా చూడాలి" అని విద్యుత్ ఏఈలు, ఏడీఈలు, డీఈలను టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి హెచ్చరించారు. ఖమ్మంలోని డీపీఆర్సీ భవనంలో మంగళవారం అధికారులతో ఆయన సమీక్షి నిర్వహించారు. విద్యుత్ ఉపకేంద్రాల పనితీరు ఆధారాలతో వచ్చిన సీఎండీ నాలుగు గంటల పాటు హాట్‌హాట్‌గా రివ్యూ చేశారు. జిల్లాలోని ప్రతి విద్యుత్ ఉప కేంద్రం ఏఈతో సీఎండీ మాట్లాడారు. ఆయా ఉపకేంద్రంలో జరుగుతున్న పలు విషయాలను ఈ సందర్భంగా సీఎండీ సమావేశంలో చెప్పటంతో విద్యుత్ అధికారుల గుండెలు జారాయి. పరోక్షంగా 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'పైసా లేనిదే పని జరగదు' కథనం ఆధారంగానే సమీక్ష నిర్వహించారు. రైతులకు పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మార్చి నాటికి నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్స్ పంపిణీ చేయాలన్నారు. రైతులకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో జాప్యం చేయవద్దన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేరుకు వస్తే ఎంఆర్‌టీ బృందం ఆ ప్రాంతానికి వెళ్లి కారణాలను తెలుసుకోవాలన్నారు. కొత్తలింగాల డివిజన్ పరిధిలో ప్రమాదాలను తగ్గించాలన్నారు. 110శాతం బిల్లులు వసూళ్లు చేయాలని ఆదేశించారు. ఖాళీలను భర్తీ చేసేందుకు కార్యాచరణ జరుగుతోందని, త్వరలోనే జిల్లాకు కావాల్సిన జేఎల్ఎంల నియామకం పూర్తి చేస్తామన్నారు. అనంతరం సీఎండీ వరుణ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలల్లోపు ఇప్పటి వరకు దరఖాస్తులు చేసిన రైతులందరికీ విద్యుత్ కనెక్షన్‌లు ఇస్తామన్నారు. ప్రస్తుతం పొలాల్లో పంటలు ఉండటంతో కనెక్షన్ ఇవ్వటంలో జాప్యం జరుగుతోందన్నారు. వినియోగదారులకు కొత్త మీటర్లు వారం నుంచి 30రోజులు లోపుగా ఇస్తామన్నారు. 200యూనిట్లు ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఉద్యోగుల బదిలీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, సంధ్యారాణి, ఎస్ఈ సురేందర్, డీఈలు బాబురావు, రామారావు, నాగేశ్వరరావు, కృష్ణ, రాములు, భద్రుపవర్, వెంకటేశ్వర్లు, హీరాలాల్, ఏడీఈలు, ఏఏవోలు పాల్గొన్నారు.

27 నుంచి జేఈఈ మెయిన్స్

- నేడు బీఆర్క్ మొదటి విడత పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కో-ఆర్డినేటర్ పార్వతీరెడ్డి



ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 23: దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత 2024 పరీక్షలకు గాను ఖమ్మం జిల్లాలో పరీక్ష కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఖమ్మం జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్.పార్వతిరెడ్డి మంగళవారం తెలిపారు. ఖమ్మం నగర పరిధిలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం నిర్వహించనున్న బీఆర్క్ మొదటి విడత పరీక్షకు 1,071 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. 27, 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో నిర్వహించనున్న జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షకు అన్ని సెంటర్లలో కలిపి 7,960 మంది విద్యార్థులు హాల్‌టికెట్లు పొందినట్లు తెలిపారు. రెండు షిఫ్టులుగా నిర్వహించే ఈ పరీక్షల్లో మొదటి షిఫ్ట్ ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8:30 గంటలకు మధ్యాహ్నం 2:30గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారని పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని, హాల్ టికెట్లలో సూచించిన సమయం, నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని తెలిపారు. ఎన్‌టీఏ వారు నిర్వహించే ఈ పరీక్షలో ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తారని, ప్రభుత్వ గుర్తింపు కార్డు లేదా ఆధార్ కార్డుతో బొటన వేలిముద్ర అనుసంధానం చేయబడి ఉంటుందని, రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తర్వాత మాత్రమే విద్యార్థి పరీక్ష స్థానం నిర్ధారణ అవుతుందన్నారు. వేరే వారు పరీక్షలు రాసే అవకాశం లేదన్నారు. ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డ్, పాస్‌పోర్ట్, రేషన్ కార్డ్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు ట్రాన్స్‌పరెంట్ పెన్, అడ్మిట్ కార్డ్ బి.ఆర్క్ పరీక్షకైతే పెన్సిల్,స్కేల్, రబ్బర్, జామెంట్రీ బాక్స్, వాటర్ బాటిల్ వెంట తీసుకొని రావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి పరీక్షకు హాజరైతే మంచిదన్నారు. పరీక్ష అనంతరం రఫ్ బుక్‌లెట్‌ను డ్రాప్ బాక్స్‌లో వేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ అడ్మిట్ కార్డులో సూచించిన సమయానికి రావాలన్నారు. ఈ సందర్భంగా పరీక్ష రాయబోయే విద్యార్థులకు జిల్లా కో-ఆర్డినేటర్ పార్వతీరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగేయాలి

ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

దుమ్ముగూడెం, జనవరి 23: గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగేయాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ సూచించారు. దుమ్ముగూడెం మండలం సింగారం గ్రామంలో మంగళవారం సింగవరం రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో పీవో సమావేశమయ్యారు. పండించే పంటలు, పెట్టుబడి ఖర్చులు, దిగుబడి, ఆదాయం, నీటిపారుదల సౌకర్యం, త్రీఫేజ్ విద్యుత్ సదుపాయం సంబంధిత వివరాలను గిరిజన రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం పథకం అమలుకు అవసరమైన సామగ్రి, జీవామృతం, ఘనామృతం తయారీకి అవసరమైన పదార్థాలను వారికి సరఫరా చేయాలని ప్రాజెక్టు వ్యవసాయ అధికారిని ఆదేశించారు. అలాగే త్రీఫేజ్ విద్యుత్ సదుపాయం కల్పించడానికి సర్వే చేసి వివరాలివ్వాలని ఏఈ మోహన్‌రెడ్డికి సూచించారు. ద్విచక్రవాహనంపై ఎన్‌లక్ష్మీపురం వెళ్లిన పీవో అక్కడ శిథిలమైన కాజ్‌వేను పరిశీలించారు. అనంతరం రైతు ముర్రం సత్తిబాబు ఇంటికి వెళ్లి ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులు పొందిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే పద్ధతులను ఐటీడీఏ ప్రోత్సహిస్తుందన్నారు. ప్రాజెక్టు వ్యవసాయ అధికారి ఉదయభాస్కర్, సింగవరం ఎఫ్‌పీవో అధ్యక్షుడు నూప సీతయ్య, సింగారం, వైట్‌నాగారం, పౌలూరిపేట, ఎన్‌లక్ష్మీపురం గిరిజన రైతులు పాల్గొన్నారు.


గిరిజన రైతులతో మాట్లాడుతున్న పీవో

కొత్తగూడెం

బీఆర్ఎస్‌లో ముసలం

- మునిసిపల్ ఛైర్‌పర్సన్‌పై 22మంది కౌన్సిలర్ల అవిశ్వాసం
- తీర్మానం పెట్టాలని కలెక్టర్‌కు వినతి

కొత్తగూడెంటౌన్, జనవరి 23: కొత్తగూడెం బీఆర్ఎస్‌లో ముసలం పుట్టింది. మునిసిపాలిటీ కౌన్సిలర్ల మధ్యవర్గ విభేదాలు వీధినపడ్డాయి. ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుమతి ఇవ్వాలంటూ గులాబీ పార్టీకి చెందిన 22 మంది కౌన్సిలర్లు కలెక్టర్ డా.ప్రియాంక అలాకు మంగళవారం ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు అసమ్మతి బీఆర్ఎస్ నాయకులకు తలనొప్పిగా మారింది. మునిసిపల్ ఛైర్‌పర్సన్ గతకొంత కాలంగా ఏకపక్ష నిర్ణయాలతో కౌన్సిలర్లను పట్టించుకోవడంలేదని, మునిసిపాలిటీలో చేపట్టే పనుల్లోను కౌన్సిలర్లకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని, బిల్లుల మంజూరులోనూ వివక్ష చూపుతున్నారని పలువురు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారం కోల్పోయి డీలా పడగా తాజాగా కొత్తగూడెం మునిసిపాలిటీలో ప్రజాప్రతినిధులే బహిరంగంగా ఫిర్యాదులు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగూడెం మునిసిపాలిటీలో 36మంది కౌన్సిలర్లు ఉండగా వారిలో బీఆర్ఎస్‌నుంచి 25కు మంది, సీపీఐ నుంచి 8మంది, కాంగ్రెస్ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లుగా ఇద్దరు ఎన్నికయ్యారు.అయితే గతంలో సీపీఐ నుంచి ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరడంతో దాంతో ఆ పార్టీకి ప్రస్తుతం 30మంది కౌన్సిలర్లు ఉన్నారు.అయితే ఇప్పుడు 22మంది కౌన్సిలర్లు ఛైర్‌సర్సన్‌పై అవిశ్వాస తీర్మాణానికి అనుకూలంగా ఉన్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ అవిశ్వాస తీర్మాన ఫిర్యాదుపై కలెక్టర్ ఎలా స్పందిస్తారోనని కౌన్సిలర్లు ఎదురుచూస్తున్నారు. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఉండటంతో రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయోనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కౌన్సిలర్ల మధ్య ఏర్పడ్డ వర్గవిభేదాలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ నాయకులు రంగంలో దిగేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఛైర్‌పర్సన్ సీతాలక్ష్మిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


కలెక్టర్ ప్రియాంకకు మునిసిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన ప్రతిని అందజేస్తున్న కౌన్సిలర్లు..

ఎన్నికల్లో మద్యం, నగదు నిఘాపై

సీజర్ మానిటరింగ్ సిస్టం

కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, జిల్లా అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 23: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న సమయంలో డబ్బు మద్యం పంపిణీ నిరోధం, పట్టుకున్న వాటి వివరాల నిర్వహణ కోసం సీజర్ మానిటరింగ్ సిస్టంను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా సీజ్ చేసి నగదు మద్యం వివరాలను ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయవచ్చన్నారు. డేటా నిర్వహణ జిల్లా ఎన్నికల అధికారులు, రాష్ట్ర సీఈవోలు జిల్లా రాష్ట్రస్థాయి నోడల్ అధికారుల పాత్ర తదితర అంశాలపై తెలంగాణ, ఏపీ కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల సీఈవోలు జిల్లా ఎన్నికల అధికారులతో మంగళవారం న్యూఢిల్లీ నుంచి విడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో పట్టుకునే నగదు, మద్యానికి సంబంధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో 25 ఏజెన్సీలను గుర్తించినట్లు తెలిపారు. అనుసరించాల్సిన పద్ధతులు ఎఫ్ఎస్‌టీ బృందాలు వ్యయ నిర్వహణ కమిటీలు యాప్ ద్వారా డేటా నమోదు జిల్లా ఎన్నికల అధికారుల బాధ్యతలు, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారుల బాధ్యతలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ విడత ఎన్నికల్లో నగదు మద్యం సీజ్ చేసిన తర్వాత వాటి విడుదలకు సంబంధించిన వివరాలను సైతం యాప్‌లో పొందుపరచనున్నట్లు తెలిపారు. నగదుకు సంబంధించి క్యూఆర్‌కోడ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా గత ఎన్నికల్లో రూపొందించిన క్యూఆర్‌కోడ్‌ను లక్ష 38 వేల మంది వినియోగించినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఈ యాప్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు వారు తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌కు ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఆర్డీవో పీడీ విద్యాచందన, డీసీవో విజయకుమారి, పశుసంవర్ధక శాఖ అధికారి వేణుమనోహర్, సివిల్‌సప్లై డీఎం శ్రీలత, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, అబ్కారీ సూపరిన్‌టెండెంట్ నాగేందర్‌రెడ్డి, సీపీవో శ్రీనివాస్, ఎన్నికల డీటీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 23: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 29వ తేదీన జరగవల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల(ఎస్ఎంసీ) ఎన్నికలువాయిదా వేస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ మంగళవారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. దీంతో 29న జరగాల్సిన ఈ ఎన్నికలు వాయిదా పడ్డావని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. 20వ తేదీన ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన అధికారులు 29న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేయ్యటంతో పాటు గతంలో ఉన్న పాత కమిటీలను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రస్తుతం పాఠశాలలకు మేనేజ్‌మెంట్ కమిటీలు లేకుండానే అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో మనఊరు-మనబడి, మనబస్తీ-మనబడి కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. ఆ పనులను పాఠశాల ప్రధానోపాధ్యాయులే పర్యవేక్షించాల్సి ఉంటుంది.

బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో చోరీ

- గంజాయి అపహరించినట్లు సమాచారం
- విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు

బూర్గంపాడు, జనవరి 23: ఎవరింట్లోనైనా దొంగలు పడితే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తాం. మరి ఆ పోలీస్‌స్టేషన్‌లోనే దొంగతనం జరిగితే.. ఆ పోలీసులు ఎవరికి ఫిర్యాదు చేయాలి..? అలాంటి ఘటనే బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. బూర్గంపాడులో నాలుగు నెలల క్రితం నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. పాత పోలీస్‌స్టేషన్‌కు దగ్గరలోనే నూ తన పోలీస్‌స్టేషన్ నిర్మించిన అధికారులు ప్రస్తుతం నూతన పోలీస్‌స్టేషన్ నుంచే విధులు కొనసాగిస్తున్నారు. అయితే పాత పోలీస్‌స్టేషన్‌లో అధికారులు కార్యకలాపాలు కొనసాగించిన సమయంలో పట్టుకున్న గంజాయిని సీజ్ చేసి అక్కడే భద్రపరిచినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బూర్గంపాడు, సారపాక, భద్రాచలం పట్టణాలకు చెందిన పలువురు యువకులు ఇటీవల భద్రపరిచిన గంజాయిని అపహరించినట్లు సమాచారం. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు పలువురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలుస్తోంది. అంతేకాక ఘటనా స్థలాన్ని క్లూస్ టీం, ఉన్నతాధికారులు సందర్శించి వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాక ఈ చోరీ వెనుక ఓ కానిస్టేబుల్ పాత్ర ఉందని తెలుసుకున్న అధికారులు.. అతడిని అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు వినికిడి. అలాగే పలు కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు సైతం చోరీకి గురయినట్లు తెలుస్తోంది. ఓ కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని కోర్టు ద్వారా బెయిల్ తెచ్చుకున్న బాధితుడికి కొంత కా లంగా అప్పగించకుండా అధికారులు కాలాన్ని వెళ్లదీస్తున్నారని సమాచారం. సదరు బాధితుడు తన ద్విచక్ర వాహనం గురించి ఆరా తీయగా.. చోరీకి గురయిందని గు ర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. వారు అపహరిం చిన ద్విచక్ర వాహనాన్ని వారు గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు అపహరణ కాగా, ఇప్పటికే మూడు వాహనాలను గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ చోరీ ఘటనపై బూర్గంపాడు ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గంజాయి చోరీకి గురయిందనే విషయం అవాస్తవమని, అటువంటిదేమీ జరగలేదని తెలిపారు.

22 కిలోల గంజాయి పట్టివేత

ఛత్తీస్ గఢ్ రాష్ట్రం కుంట నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను బూర్గంపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. బూర్గంపాడు పోలీసులు సోమవారం సాయంత్రం సారపాకలో వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో స్కూటీపై వస్తున్న ముగ్గురు యువకులు వాహన తనిఖీలను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. వారిలో బూర్గంపాడుకు చెందిన గిరిబోయిన విష్ణువర్ధన్, బూర్గంపాడు, సారపాకకు చెందిన ఇరువురు మైనర్లు న్నారు. వీరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట నుంచి ఓ వ్యక్తి దగ్గర 22 కిలోల గంజాయిని కొనుగోలు చేసి బ్యాగుల్లో తీసు కొస్తున్నారు. పోలీసులు వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి నుంచి రేగొండకు గంజాయి తరలింపు

- టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డ నిందితులు
- నిందితుల్లో ఒకరు కానిస్టేబుల్ ఉన్నట్టు ప్రచారం?

భద్రాచలం, జనవరి 23: భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి సమీపంలో గంజాయిని తరలిస్తున్న ఇరువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని పోలీసులు వారిని విచారించిన సమయంలో ఆ గంజాయి తమకు భద్రాచలంలో ఇరువురు వ్యక్తులు అమ్మినట్లు చెప్పారని వినికిడి. దీంతో ఈ విషయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు భద్రాచలం వచ్చి ఆ ఇరువురిని అదుపులోకి తీసుకొని విచారించగా తమకు భద్రాచలంలో ఒక కానిస్టేబుల్ గంజాయి ప్యాకెట్లను ఇచ్చినట్లు తెలపడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు సదరు కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయమై పోలీసు వర్గాలు అధికారికంగా ఎటువంటి సమాచారం వెల్లడించడం లేదు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి

అశ్వారావుపేట రూరల్, జనవరి 23: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వివాహిత మృతిచెందింది. ఈసంఘటన మండలంలో జరిగింది. మండలంలోని కొత్తకావడిగుండ్లకు చెందిన సోడెం వరలక్ష్మీ(25) ఈనెల 21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు వరలక్ష్మీకి అశ్వారావుపేట, కొత్తగూడెంలో చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వరలక్ష్మీ సోమవారం రాత్రి మృతిచెందింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

దుమ్ముగూడెం మండలంలో వ్యక్తి..

దుమ్ముగూడెం, జనవరి 23: చిన్నార్లగూడేనికి చెందిన కొమరం చంద్రయ్య(45) చికిత్స పొందుతూ మంగళవా రం మృతిచెందాడు. మద్యం మానమని కుటుంబ సభ్యుల మందలింపుతో మనస్థాపం చెందిన చంద్రయ్య ఈనెల ఒకటో తేదీన పురుగుల మందు తాగి ఆత్మహ త్యకు యత్నించాడు. అపస్మారక స్థితికి చేరుకున్న చంద్రయ్యను వైద్యచికిత్సల కోసం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. భార్య రుక్మిణి ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ గణేష్ కేసు నమోదు చేశారు.


పురుగులమందు తాగి నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

పినపాక, జనవరి 23: మండలం లోని మద్దులగూడెం గ్రామానికి చెం దిన నర్సింగ్ విద్యార్థిని పర్శిక శైలజ (19) పురుగులమందు తాగి ఆత్మ హత్యకు పాల్పడింది. ఈసం ఘటన మంగళవారం జరిగింది. స్థా నికులు తెలిపిన వివరాల మేరకు, మణుగూరులోని ఓ ప్రైవేటు కళా శాలలో నర్సింగ్ చదువుతున్న పర్శిక శైలజ పు రుగుల మందు తాగింది. గమనించిన బంధువులు వెంటనే పినపాక ప్రభుత్వాసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మణుగూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికి త్స పొందుతూ మృతి చెందిందని బంధువులు తెలి పా రు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమా ర్టమ్‌కు తరలించారు.

మహిళ బంగారు, వెండి ఆభరణాల చోరీ

అశ్వారావుపేట రూరల్, జనవరి 23: ఆర్టీసీ బస్‌లో ప్రయాణిస్తున్న మహిళ వద్ద ఉన్న దాదాపు రూ.18లక్షల విలువైన బంగారు, వెండీ ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రాలోని జంగారెడ్డిగూడేనికి చెందిన ఆంగోతు లలిత సోమవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లేందుకు బస్ ఎక్కారు. బ్యాగులో హారం, నక్లెస్, గొలుసులు, ఉంగరాలు ఇలా అన్ని ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.11వేల నగదను పెట్టుకున్నారు. బస్ అశ్వారావుపేట వచ్చిన తరువాత లలిత బ్యాగును చూడగా జిప్‌లు తీసి ఉండటాన్ని గమనించారు. వెంటనే బ్యాగును వెతకగా అందులో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు చోరీ అయినట్లుగా గుర్తించారు. బస్‌లో కొందరు అనుమానాస్పదంగా కనిపించారని బాధితురాలు తెలిపారు. జరిగిన సంఘటనపై కుటుంబసభ్యులకు తెలిపి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాధితురాలు చెప్పిన వివరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా: పంచాయతీ కార్మికుడు దుర్మరణం


రాంమ్మూర్తి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

గుండాల, జనవరి 23: రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలకు నీళ్లు పడుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడ టంతో ఓ గ్రామపంచాయితీ కార్మికుడు మృతి చెందా డు. ఈ సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సాయనపల్లిలో బొమ్మెర రాంమ్మూర్తి(32) గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం గుండాల-సాయనపల్లి రహదారి మార్గంలోని రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీళ్లు పడుతు న్నారు. కాగా, రోడ్డుకు ఇరువైపులా పోసిన సైడ్‌బర్మ్ వర్షా లకు కొట్టుకుపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఈ క్రమం లోనే మొక్కలకు నీళ్లు పట్టేందుకు రోడ్డు దిగువకు రావడం తో ట్యాంకర్ ఒకవైపు ఒరిగి, ఇంజన్‌తో పాటు బోల్తా ప డింది. డ్రైవర్ ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకొని అక్కడి కక్కడే మృతి చెందాడు. పంచాయతీ కార్మికుడి మృతితో సాయనపల్లిలో విషాదచాయలు అలుముకు న్నాయి. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం ని మిత్తం మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు.

నకిలీ 'పోచంపల్లి'!


వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

- పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు
- భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు
- 200 ప్రింటింగ్ చీరలు సీజ్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకే ఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరి కొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 19 మంది; బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్ల తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆంథోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే 'అసెంబ్లీ సమీక్షలు'

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం
- గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్
- పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తర ఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకో ర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

- 2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి
- తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు
- తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

నల్లసూర్యులకు అండగా బలరాముడు



మ్యాన్‌రైడింగ్ సిస్టం ద్వారా రామగుండం భూగర్భగనిలోకి వెళ్తున్న సింగరేణి సీఎండీ బలరాం



కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న సీఎండీ

- ఆకస్మికంగా భూగర్భ బావుల్లో పర్యటించిన సింగరేణి సీఎండీ
- ఓపెన్‌కాస్టుల్లో కార్మికుల పని ప్రదేశాల్లో తనిఖీలు
- సింగరేణిలో నూతన అధ్యాయానికి తెరలేపిన బలరాంనాయక్

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 23: సింగరేణి సంస్థ చరిత్రలో నూతన అధ్యాయనానికి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన బలరాం శ్రీకారం చుట్టారు. సింగరేణి భూగర్భ బావుల్లో కార్మికులు విధులు నిర్వహించే భూగర్భ బావుల్లోకి ఆకస్మికంగా వెళ్లి పని ప్రదేశాలను పరిశీలించిన కార్మికు సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చర్యలు చేపట్టారు. తెలంగాణ ప్రాంతంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సంస్థకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితుడైన బలరాం నూతన ప్రాజక్టుల ఏర్పాటు కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. 135సంవత్సరాల చరిత్రలో సింగరేణి బొగ్గుబావులను చైర్మన్ చైర్మన్ హోదాలో సందర్శించి కార్మికులచే శభాష్ అనిపించుకున్నారు.

ఇటీవల రామగుండం ఏరియా పర్యటనలో భాగంగా రామగుండం 01 భూగర్భబావిలోకి మైన్‌రైడింగ్ సిస్టం ద్వారా కార్మికులు పని చేసే ప్రదేశానికి వెళ్లి పనుల ను పరిశీలించారు. కార్మికులకు అవసరమైన గాలి అందుతుందా.. లేదా బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన వివరాలను తెలుసుకుని కార్మికులు టిఫిన్ చేసే క్యాంటీన్‌లోనే చైర్మన్ టిఫిన్ చేయడం గమనార్హం.సింగరేణి సంస్థలో నూతన ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి సింగరేణి సంస్థ అభివృద్ధి నూతన ప్రాజెక్టుల ఏర్పాటు, కార్మికుల సంక్షేమం, బొగ్గు ఉత్పత్తి రవాణాలపై సమాచారం అందించి నూతన ప్రభుత్వంచే శభాష్ అనిపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం ప్రాంతంలో సింగరేణి మార్కెట్‌ను సైతం సందర్శించి నూతన ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు నిత్యవసర వస్తువులు అందించే సింగరేణి సూపర్‌బజారును సైతం సందర్శించి కార్మికులకు నాణ్యతతో కూడిన వస్తువులను అందచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జనరల్ మేనేజరు (పర్సనల్) హనుమంతరావును ఆదేశించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడి ప్రభుత్వం సింగరేణి సంస్థపై డిసెంబరు 27వ తేదీన నిర్వహించిన సమీక్షలోనే సంస్థకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేశారు. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో నిర్వహించిన సమీక్షలో ప్రజాప్రతినిధులకు అవసరమైన పూర్తి సమాచారాన్ని అందచేయడంతోపాటు సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కార్మికుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు, నూతన ప్రాజెక్టుల ఏర్పాటుపై రూపొందించిన ప్రణాళికలను ప్రభుత్వ పెద్దలకు వివరించారు. గతంలో సీఎండీగా దీర్ఘకాలం పని చేసిన శ్రీధర్ పదవి కాలం ముగియడంతో డైరెక్టర్ (పా)గా విధులు నిర్వహిస్తున్న బలరాంకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పచెప్పింది. దీంతో సింగరేణి వ్యాప్తంగా చైర్మన్ హోదాలో పర్యటిస్తూ కార్మికులచే శభాష్ అనిపించు కుంటున్నారు. సింగరేణి సీఎండీగా డైరెక్టర్(పా), డైరెక్టర్ ఫైనాన్స్‌గా విధులు నిర్వహిస్తున్న బలరాం సింగరేణి సంస్థలో కీలకపదవులను నిర్వహిస్తు అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం. సింగరేణి సంస్థలో కీలకమైన మూడు విబాగాలను పర్యవేక్షిస్తున్నారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, సింగరేణి డైరెక్టర్ (పా)గా డైరెక్టర్ (ఫైనాన్స్)గా విధులు నిర్వహిస్తున్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను సైతం సమర్థవంతంగా నిర్వహించి కార్మికసంఘాలు, కార్మికులకు సైతం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ ముందస్తు చర్యలు చేపట్టారు.



ఓపెన్‌కాస్టులో పని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ బలరాం

భద్రాద్రి జిల్లాలో ఐదుగురు ఎస్ఐల బదిలీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి23: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. కొత్తగూడెం త్రీటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఐ.జీవన్‌రాజును జూలూరుపాడుకు, జూలూరుపాడు ఎస్ఐ బి.పురుషోత్తంను కొత్తగూడెం త్రీటౌన్‌కు ములకలపల్లి ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డిని దమ్మపేటకు, దమ్మపేట ఎస్ఐ రవికుమార్ కొత్తగూడెం వన్‌టౌన్‌కు కొత్తగూడెంకు వన్‌టౌన్ ఎస్ఐ తిరుపతిని ఎటాచ్ భద్రాద్రి, ములుగు జిల్లాలకు బదిలీ చేశారు.

11, 12వ తేదీల్లో టీపీటీఎఫ్ మహాసభలు

పెనుబల్లి, జనవరి 23: ఖమ్మంలోని నయాబజార్ పాఠశాలలో ఫిబ్రవరి 11,12తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం లింగగూడెం జడ్పీఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి సమాన విద్య, సమాన అవకాశాలు, సమాజ చైతన్యం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పలు సమస్యలపై చైతన్యం తీసుకురావడానికి రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పి.శ్రీని, అధ్యక్షుడు వి.మహేష్, ఎం.నాగేశ్వరరావు, చిన్నిరాము పాల్గొన్నారు.

అడవుల పునరుద్ధరణకు కృషి చేయాలి

- జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్



వివరాలు తెలుసుకుంటున్న డీఎఫ్‌వో

ఆళ్లపల్లి, జనవరి 23: అంతరించిపోతున్న అడవులను పునరుద్ధరణ చేసేందుకు అటవీ శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన కాచనపల్లి రేంజీ పరిధిలోని సుద్దరేవు బీట్ అడవిని పరిశీలించారు. అడవుల్లో జరిగిన కుంటలు, చెక్‌డ్యాం పనులను పరిశీలించారు. రేగళ్ల, కాచనపల్లి రేంజీ సరిహద్దులను, ఆయా పరిధిలో వన్యప్రాణుల కోసం చేపట్టే కార్యక్రమాలు, చెట్ల పెంపకంపై పలు విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎఫ్‌డీవో వెంకన్న, ఎఫ్ఆర్‌వోలు నాగేశ్వరావు, జశ్వంత్, అటవీశాఖ అధికారులు వెంకన్న, మురళి, సతీష్, నరేష్, వీరేందర్ పాల్గొన్నారు.

బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనతో ప్రపంచమంతా సంబురాలు



మాట్లాడుతున్న దేవకి వాసుదేవరావు

ఖమ్మం బైపాస్‌రోడ్, జనవరి23: అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠను ప్రపంచంలోని భారతీయులు, హిందువులంతా సంబురాలుగా జరుపుకొన్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, గత పార్లమెంట్ అభ్యర్థి దేవకి వాసుదేవరావు అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రాష్ట్రలో కనీసం సెలవుకూడా ప్రకటించలేదన్నారు. ఖమ్మం అభివృద్ధికి కేంద్ర నిధులే కారణమని, ప్రజలు అది గుర్తించి రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. నగరంలో ఓ బీఆర్ఎస్ నాయకుడు భూములను కబ్జాచేశారని, అది అందరికి తెలిసిందని, ఇంకాఅలాంటి నాయకులు చాలామంది ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఉప్పల శారద, పాల్గొన్నారు.

27లోపు సీఎంఆర్ బియ్యాన్ని అందించాలి

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 23: ఈనెల 27లోపు పెండింగ్ సీఎంఆర్ రైస్ దిగుమతి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. మంగళవారం పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో కలెక్టరేట్‌లో సీఎంఆర్ రైస్ పంపిణీపై మిల్లుల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన పెండింగ్ సీఎంఆర్ బియ్యాన్ని నిల్వలను త్వరితగతిన భారత ఆహార సంస్థకు పంపించాలన్నారు. నిర్దేశిత సమయంలో పంపిణీ చేయని మిల్లర్లపై చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా మేనేజర్ జి శ్రీలత, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు బొమ్మా రాజేశ్వరరావు, అధికారులు మిల్లర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు అవ్వాలి

ఎమ్మెల్సీ ఎన్నికలకు నూరుశాతం పట్టభద్రులు ఓటర్లుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ డి మధుసూదన్ నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఎమ్మెల్సీ ఓటరు నమోదు, ఎస్ఎస్ఆర్ 2024 దరఖాస్తుల పరిష్కారం ఇతర రెవెన్యూ అంశాలపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 24 వేల మంది పట్టభద్రులు ఓటు కోసం నమోదు చేసుకున్నట్లు నమోదు కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయాలన్నారు.

ఖమ్మం.. సాహిత్య గుమ్మం

- కవిత్వం, కథ విభాగాల్లో జాతీయ స్థాయి పురస్కారాలు ప్రదానం
- రెండు రాష్ట్రాల స్థాయికి విస్తరించిన సాహిత్య సేవ

ఖమ్మం అంటే కవిత్వమే కాదు కథ కూడా అన్న స్థాయిలో ఖమ్మం సాహిత్యం తన ఉనికిని చాటుతోంది. సాహిత్య వ్యాప్తి కథకు విస్తరించడమే కాక కథ, కవిత్వ విభాగాల్లో ప్రతిభావంతులకు జాతీయ స్థాయిలో బహుమతులు ఇచ్చే స్థాయికి చేరటంతో ఖమ్మం సాహిత్య సేవ ఉమ్మడి రాష్ట్రంలో ప్రముఖంగా మారింది. ఖమ్మం కవుల గుమ్మం అన్న నానుడి ఎప్పటినుంచో ఉంది. మొదటి నుంచి దిగ్గజ కవి శ్రేష్టులను కలిగి ఉండటంతో ఖమ్మం తెలుగు రాష్ట్రాల్లో కవుల కార్ఖానా అన్న బిరుదు పొందింది. నాటి తరం చందాల కేశవ దాసు, దాశరథి సోదరులు మొదలు కొని సీతారాం, అఫ్సర్, ప్రసేన్, యాకూబ్, వంశీకృష్ణల దాకా ఎందరో మేటి కవులను అందించిన ఘనత ఖమ్మం సొంతం. మేలైన కవిత్వం రాయటం పుస్తకాలను వెలువరించటమే కాక జాతీయ స్థాయిలో కవులకు అవార్డులు బహుమతులు ప్రదానం చేసే స్థాయికి ఖమ్మం కవులు, సాహిత్య సంస్థలు ఎదగటం విశేషం. సాధారణంగా మెట్రో స్థాయి నగరాల్లో రెండో మూడో సాహిత్య సంస్థలు కవిత్వ బహుమతులు అవార్డులు ఇచ్చే స్థాయి కలిగి ఉంటాయి.

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 23: ఖమ్మంలాంటి నగరం నుంచే అయిదారు సాహిత్య సంస్థలు జాతీయ స్థాయిలో తమవంతు సాహిత్య సేవ చేస్తుండటం పట్ల కొత్తతరం సాహితీకారులకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మరింత గుర్తింపునకు కారణమయ్యింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లో సైతం నివసించే తెలుగు సృజనకారుల కవితలు, కథలకు, వారి సంపుటాలకు బహుమతులను ప్రదానం చేస్తున్నారు. ప్రత్యేకంగా పోటీలను ఏర్పాటు చేసి రచనలు ఆహ్వానిస్తుండటంతో ఏడాది పొడవునా ఏదో ఒక సాహిత్య సంస్థకోసం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లోని కవులు, కథా రచయితలు ఖమ్మం సాహిత్యం వైపు దృష్టి సారిస్తున్నారు. ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా కేవలం సాహిత్య సేవ పరమావధిగా ఖమ్మం సాహితీవేత్తలు, సాహిత్య సంస్థల ప్రతినిధులు తమవంతు సేవలందిస్తున్నారు.

మెగా పొయెట్‌గా పేరొందిన మువ్వా శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన మువ్వా పద్మావతి, రంగయ్య అవార్డు రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. భారీ స్థాయిలో కార్యక్రమాలను సభలను జాతీయ స్థాయి సాహితీవేత్తలతో నిర్వహించటం ప్రముఖ సాహితీవేత్తకు పురస్కారంతోపాటు ఏటా తొమ్మిది మంది యువ కవులకు, కవిప్రముఖులకు అవార్డులతో సత్కరిస్తున్నారు. ఈ అవార్డులతోపాటు గతేడాది నుంచి ప్రముఖ కవి ఆవంత్స సోమసుందర్ పేరున మరో ప్రత్యేక అవార్డును సాహితీవేత్తలకు అందిస్తున్నారు. మెగా ఈవెంట్ నిర్వహిస్తూ కవులను సముచిత రీతిన సత్కరిస్తుండటంతో తెలుగు రాష్ట్రాల్లోని సాహిత్య దిగ్గజాలు, కవుల చూపు ఖమ్మం వైపుగా మారింది. ఈ అవార్డు ప్రక్రియ ఇతర కవులకు స్ఫూర్తిదాయకమైంది. పద్మావతి రంగయ్య అవార్డుతోపాటు కవి, జర్నలిస్టు అరుణ్ సాగర్ స్మారక అవార్డును జర్నలిస్టులతోపాటు కవి ప్రముఖులకు అందజేస్తుండటం విశేషం.



హాసినీ రామచంద్ర (హెచ్‌ఆర్‌సీ) అవార్డు ప్రదాన దృశ్యం

మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న గుర్రం జాషువా సాహిత్య సంస్థ ప్రత్యేక పురస్కారాన్ని అందజేస్తోంది. 'మన కాలం జాషువా' పేరున సాహిత్య ప్రముఖుడికి పురస్కారం ఇచ్చే ఆనవాయితీకి గతేడాది శ్రీకారం చుట్టారు. ప్రముఖ కవి విమర్శకుడు కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం తన మాతృమూర్తి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సాహితీ మాణిక్యం కవిత్వంలో కృషి చేస్తున్న వారిని గుర్తించి మాణిక్యం అవార్డుతో సత్కరించే కార్యక్రమం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నారు. సాహితీ మాణిక్యం అవార్డును అందుకోవటం తమ సాహిత్య కృషికి దక్కిన గౌరవంగా కవులు భావించే స్థాయికి ఈ అవార్డు ఎదిగింది.

మరో కవి దిగ్గజం కవి సంగమం సాహిత్య సంస్థ నిర్వాహకుడు యాకూబ్ రొట్టమాకు రేవు అవార్డు పేరుతో ప్రదానం చేస్తున్న అవార్డుకు తెలుగు సాహితీ లోకంలో మంచి పేరు దక్కింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించినా సరే జిల్లాలోని రొట్టమాకు రేవు గ్రామం పేరుతో పరిసర ప్రాంతాల ప్రముఖుల పేర్లతో కవులకు అవార్డులు అందజేస్తున్నారు. ఇటీవల మరొక ప్రభంజనంలా దూసుకొచ్చిన సాహిత్య సంస్థ ఖమ్మం ఈస్థటిక్స్ ప్రముఖ విద్యావేత్త రవి మారుత్ ఈ అవార్డును నెలకొల్పటంతో పురస్కారానికి అతి తక్కువ కాలంలో సాహిత్య గౌరవం దక్కింది. ఉమ్మడి రాష్ట్రంలోని కవులు, కథా రచయతలకు రెండేళ్లుగా ఈసంస్థ తరుపున అవార్డులు దక్కుతుండటం, ప్రత్యేక కథా సాహిత్యం వెలువరిస్తుండటం పట్ల రెండు రాష్ట్రాల్లోని సాహితీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

మరొక సాహిత్య సంస్థ అక్షరాల తోవ స్థాపించిన అనతి కాలంలోనే తెలుగు రాషాల్లో మంచి గుర్తింపు దక్కించుకుంది. ప్రతీ సంవత్సరం కథలు, కవిత్వ పోటీలు నిర్వహిస్తూ విజేతలను ఖమ్మం ఆహ్వానిస్తూ బహుమతులు అందిస్తుండటంతోపాటు ప్రత్యేకంగా సాహిత్య పుస్తకాలను వెలువరిస్తోంది. రాచమళ్ల ఉపేందర్, దాసరోజు శ్రీనివాస్, నామా పురుషోత్తంల త్రయం ఈ అవార్డును విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ప్రముఖ రచయత్రి ఉరిమళ్ల సునంద స్థాపించిన ఉరిమళ్ల ఫౌండేషన్ సాహిత్య ప్రోత్సాహకాలను అందించటంలో తనవంతు పాత్రపోషిస్తోంది. కథలు, కవిత్వంలో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తోంది.

ప్రముఖ కవయిత్రి తోట సుభాషిణి స్థాపించిన హాసిని రామచంద్ర ఫౌండేషన్ (హెచ్ఆర్ సీ) సైతం సాహిత్య వ్యాప్తికి తనవంతు పాత్రపోషిస్తోంది. కథా విభాగంలో ఆణిముత్యాలను గురిస్తూ గతేడాది పురస్కారాలను ప్రదానం చేసింది. కవిత్వం, కథల సృజనలో కృషి చేస్తున్న ప్రతిభావంతులకు ఈ అవార్డుల ద్వారా గుర్తింపు లభిస్తోంది. యువ కవి, ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు గ్రహీత ఇబ్రహీం నిర్గున్ ప్రముఖ కవి శివారెడ్డిపై గౌరవంగా ప్రత్యేక అవార్డును అందించనున్నట్లు ఇటీవల ప్రకటించారు. కవిత్వ విభాగంలో కృషి చేస్తున్న యువ కవుల సంపుటాలకు ఈ అవార్డులను ఇవ్వనున్నారు.



అక్షరాల తోవ అవార్డు



మువ్వా పద్మావతి, రంగయ్య అవార్డు



మన కాలం జాషువా పురస్కారం



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న ఆయిల్‌ఫెడ్ రైతు సంఘ నాయకులు, అధికారులు

రాయితీపై పామాయిల్ మొక్కలు ఇప్పించండి

- వ్యవసాయ మంత్రి తుమ్మలకు వినతి

అశ్వారావుపేట, జనవరి 23: పట్టాదారు పాస్ పుస్తకం లేకపోయిన ఆసక్తి ఉన్న ప్రతి ఒక్క రైతుకు పామాయిల్ మొక్కలను ఇప్పించాలని టీఎస్ ఆయిల్‌ఫెడ్ రైతు సంఘ అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం తుమ్మలను కలసి లిఖితపూర్వకంగ లేఖను అందజేశారు. చాలా మంది రైతులు పామాయిల్ మొక్కలు వేసుకుందామని ఉన్న ధరణి సమస్యలవల్లో, ఇతర సమస్యలతో పట్టాదారు పాస్ పుస్తకాలు లేక పోవడంవల్ల పామాయిల్ మొక్కలను వేసుకోలేకపోతున్నారని, అటువంటి వారందరికి రాయితీపై మొక్కలను అందజేయాలని లేఖలో పేర్కొన్నారు. స్పందించిన తుమ్మల నాగేశ్వరరావు త్వరలోనే దీనికి సంబంధించి ఆదేశాలు జారీ చేయిస్తానని, ఆసక్తికలిగిన వారందరికి మొక్కలు ఇవ్వాలని ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో బండి భాస్కర్, అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్లు ఆకుల బాలకృష్ణ, శ్రీకాంత్ ఉన్నారు.

'ధరణి' కమిటీ ఆహ్వానం మేరకు హైదరాబాద్‌కు కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 23: ధరణి పోర్టల్ పునర్నిర్మాణంలో భాగంగా రోడ్‌మ్యాప్ రూపొందించేందుకు ధరణి కమిటీ ఆహ్వానం మేరకు ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ నేడు సమీక్షకు హాజరుకానున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు, జిల్లా కలెక్టర్ల అనుభవాలను తెలుసుకోవాల న్న లక్ష్యంతో కమిటీ నిర్ణయం మేరకు కొంత మంది జిల్లా కలెక్టర్లను కమిటీ సమావేశానికి ఆహ్వానించారు. ఈ ఆహ్వానం మేరకు జిల్లా కలెక్టర్ పాల్గొననున్నట్లు తెలిసింది. ధరణి పోర్టల్‌లో అమలుపై ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు మంచి అనుభవం ఉన్నట్లు గుర్తించారు. గతంలో ఆయన జిల్లాలో ధరణి సమస్యలను దాదాపు లక్ష వరకు పరిష్కరించి రాష్ట్ర వ్యాప్తంగా మెదటి స్థానంలో నిలిచారు. ఈ పనితీరును గుర్తించిన కమిటీ సభ్యులు ధరణి మాడ్యుల్స్‌పై కలెక్టర్ అనుభవాలను పంచుకోనున్నట్లు తెలిసింది.

క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- ప్రతీఒక్కరికి పోలీస్ శాఖలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది
- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి23: పోలీస్ శాఖలో పనిచేసే ప్రతీఒక్కరు మానసికంగా, శారీరకంగా దృఢత్వం కలిగి ఉన్నప్పుడే బాధ్యతాహితమైన విధులను క్రమ క్షణతో నిర్వర్తించగలుగుతారని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. మంగళవారం హేమచంద్రాపురంలో గల జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఏఆర్ సిబ్బందికి మొబలైజేషన్ పెరేడ్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు హాజరయ్యారు. ఎస్పీకి ముందుగా జిల్లా సాయుధ బలగాలు గౌరవ వందనం స్వీకరించారు. 5 ప్లాటూన్లతో ఏర్పాటు చేసిన ఈ పెరేడ్‌కు ప్లాటూన్ కమాండర్‌గా రవి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదిహేను రోజుల పాటు జరిగే ఈ మొబలైజేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ, పోలీస్ శాఖలో కాలనుగుణంగా అనుసరిస్తున్న శిక్షణను పొందాలని సూచించారు. పోలీస్ శాఖలో క్రమ శిక్షణ చాలా కీలకమని, అందుకనుగుణంగా అందరు బాధ్యతగా పని చేయాలని కోరారు. రీఫ్రెష్ కోర్సులాంటి మొబలైజేషన్, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందికి చాలా కీలకమని అన్నారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలు మర్చిపోకుండా ఉండడంతో పాటు, శారీరకంగా దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని తెలిపారు. 15 రోజుల పాటు, ఉత్సాహంగా పాల్గొని గతంలో శిక్షణ పొందిన మెలుకువలను నివృత్తి చేసుకుంటూ ఇండోర్, అవుట్‌డోర్, ఫైరింగ్ శిక్షణలో ప్రతిభ చూపాలన్నారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత, కుటుంబ పరమైన, శాఖ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయబాబు, అడ్మిన్ ఆర్ఐ రవి, ఎంటీవో సుధాకర్, హోంగార్డ్ ఆర్ఐ నరసింహారావు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డు ప్రభాకర్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి

కొత్తగూడెం పోలీస్ శాఖలో 37 సంవత్సరాల సర్వీస్‌ను పూర్తి చేసుకొని పదవి విరమణ పొందిన హోంగార్డు సీహెచ్ ప్రభాకర్‌రావు దంపతులను మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పని చేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ నరసింహారావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హోంగార్డ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్నకు వందనం

కుటుంబ విలువల ప్రోత్సాహానికి ప్రత్యేక కార్యక్రమం

వైరా, జనవరి 23: వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సామాజిక, కుటుంబ విలువలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో అమ్మానాన్నకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పతనమవుతున్న సామాజిక కుటుంబ విలువలను ప్రోత్సహించేందుకుగానూ ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చైర్మన్ జైపాల్‌తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు జి.మాధవరావు, ఉపాధ్యాయులు దొడ్డా వరప్రసాద్, సురేష్, చంద్రశేఖర్, భాస్కర్‌రావు, మాధవరావు, రామకృష్ణ, రఫీ, నర్సింహారావు, సీతరామారావు, పద్మావతి, తులసీ, నేలవేణి, అనితాదేవి, రోజామేరీ, కవిత పాల్గొన్నారు.



అమ్మానాన్నకు వందన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు


ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి నారా లోకేష్‌బాబు 41వ జన్మదిన వేడుకలను మంగళవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ చంద్ర ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా కేతినేని హరీష్ మాట్లాడుతూ యువ నాయకుడు పాదయాత్ర చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసి తండ్రికి తగిన తనయుడిగా నిత్యం శ్రమిస్తున్నారని అన్నారు. నారా లోకేష్ ఇలాంటి వేడుకలు ఎన్నో జరుపుకోవాలని యువగళం ద్వారా ఆంధ్ర రాష్ట్రంలో టీడీపీ సత్తాను చూపారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు మందపల్లి రజని, రాష్ట్ర నాయులు కోనేరు రాణి, వాసిరెడ్డి భాస్కరరావు, పద్మనాభుల నారాయణరావు కూచిపూడి జై , కన్నేటి పృథ్వి, నాంగడ్ల లక్ష్మణ్, చింతనిప్పు నాగేశ్వరరావు, రామానుజం పొదిల భూపతి, బోయిన వెంకన్న, అనంతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జలాంజనేయ స్వామి దేవస్థానంలో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూరపాటి వెంకటేశ్వర్లు, ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. యువగళం పాదయాత్ర ద్వారా తెలుగుజాతి ప్రజల గుండెల్లో స్థానం పొందారని అన్నారు. పార్టీకి పునర్ వైభవాన్ని తీసుకురావడంలో లోకేష్ పాత్ర అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో సానబోయిన శ్రీనివాస్, ప్యారీస్ వెంకన్న, గుండెపిన్ని నాగేశ్వరరావు, మేకల సత్యవతి, నల్లమల రంజిత్, మాధవశెట్టి హరి, కర్నాటి సీతారాములు, చీగుళ్ల రమణ, మేడా శ్రీనివాస్, సాలం లావణ్య కృష్ణమదారి యూన్నీ జగదీష్, డీవీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
6
బుధవారం 24 జనవరి 2024



సదరం ధ్రువీకరణకు 72 మంది అర్హులు

ఖమ్మంకలెక్టరేట్, జనవరి 23: సదరం శిబిరాలకు విశేష స్పందన లభి స్తోంది. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో సదరం క్యాంపును నిర్వహించారు. 163 మంది మీసేవల్లో రిజిస్ట్రేషన్ చేసుకోగా 116 మంది మాత్రమే హాజరయ్యారు. వీరిలో 72 మంది మాత్రమే అర్హులుగా గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. వికలాంగులు 65, కంటిచూపు లోపం ఉన్న వారు 13, మానసిక వైకల్యం కలిగిన వారు 28 వినికిడిలోపం ఉన్నవారు 8 మంది హాజరయ్యారు. వీరికి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వినయ్‌కుమార్, జ్యోతి, హిమబిందు, కంటివైద్యుడు డాక్టర్ రామూనాయక్, సౌజన్య, డాక్టర్ ఆదర్శ్ మానసిక వికలాంగులకు డాక్టర్ రాంప్రసాద్, పిడియాట్రిషీయన్ డాక్టర్ బాబూ రత్నాకర్, ప్రసన్నకుమార్ పరీక్షలను నిర్వహించారు. మొత్తం 72 మంది సదరం ధ్రువీకరణ పత్రాలకు అర్హులుగా తేల్చారు. వీరికి త్వరలో సదరం ధ్రువీకరణ పత్రాలను అందచేయనున్నారు. సదరం శిబిరాన్ని జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ పరిశీలించా రు. దివ్యాంగులకు సౌకర్యాలను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సదరం క్యాంపు బాధ్యులు వినయ్‌కుమార్, కిషన్‌రావు, కొర్రి వీరయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి

కొణిజర్ల, జనవరి 23: ఖమ్మంలో ఫిబ్రవరిలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ పీవీఆర్‌కే ప్రసాదరావు పిలుపునిచ్చారు. మంగళవారం మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను కొణిజర్లలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కామన్ స్కూల్ విధానాన్ని తీసుకరావాలని, అసమానతుల పెరిగిపోతున్నాయని ఆవేదన చెందారు. గత పాలకులు ప్రవేటు విద్యారంగాన్ని ప్రోత్సహించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న 22వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. శాంతకుమారి, వీరాచారి, వెంకటేశ్వర్లు, ఖాసీంపాషా, దేవసహాయం, శంకర్, శ్రీదేవి, రఘునాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల మిర్చిని కొనుగోలు చేయాలి

ముదిగొండ, జనవరి 23: ముదిగొండలోని చాంగ్‌వాంగ్ మిర్చి పరిశ్రమ యాజమాన్యం రైతులు పండించిన మిర్చిని కొనుగోలు చేయాలని మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో పరిశ్రమ మేనేజర్ రమేష్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. పరిశ్రమకు చుట్టూపక్కల ఉన్న గ్రామాల్లో రైతులు పండించిన మిర్చి మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, నాయకులు రాయల వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి ప్రసాద్, కోలేటి ఉపేందర్, కందుల భాస్కర్‌రావు, మర్లపాటి కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వీరశేఖర్, రమేష్ పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి: టీఆర్‌టీఎఫ్

ఖమ్మం రూరల్, జనవరి 23: రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టిగుండ్ల దుర్గయ్య, కార్యదర్శి మేకల రవికిరణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు పక్కాగా చేపట్టాలి: డీఏవో విజయనిర్మల

ఖమ్మం రూరల్, జనవరి 23: క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించిన తరువాతనే పంటల నమోదు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అధికారులకు సూచించారు. మండల పరిదిలోని ముత్తగూడెంలో పంటల నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా ఉన్న పంటలను సాగుచేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకుందాం: ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, జనవరి 23: దేశ స్వాతంత్ర సమరంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయులను ప్రత్యేక సందర్భాలలో స్మరించుకుందామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని రింగ్‌సెంటర్ వద్ద బాపూజీ చిత్ర పటంతో పాటు నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు.

యువత సన్మార్గంలో నడవాలి

సమాజంలో యువత మహనీయులు చూపిన సన్మార్గంలో నడవాలని సత్తుపల్లి మునిసిపల్ ఛైర్‌పర్సన్ కూసంపూడి మహేష్ కోరారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుని సుభాష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో పీఎల్.ప్రసాద్, కొత్తూరు ప్రభాకరరావు, దండు ఆదినారాయణ, కొత్తూరు సత్యనారాయణ, బాడిష లింగమూర్తి, ఎస్ఎల్.నరసింహారావు, ప్రసాద్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి

బోనకల్, జనవరి 23: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వలస కూలి మృతి చెందాడు. ఈ సంఘటన పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దిండోరి జిల్లా అమర్‌పూర్ మండలం రామ్‌గర్ కు చెందిన కుస్రం వీరేందర్(23) మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి రైతుకు చెందిన మిరప తోటల్లో పనులకు కొంత మందితో కలిసి వచ్చాడు. గ్రామానికి దగ్గరలో రోడ్డు పక్కన టెంట్లు వేసుకొని ఉంటున్నారు. ఈ క్రమంలో సరుకులు తీసుకొని వచ్చేందుకు సోమవారం రాత్రి కిరాణం షాపునకు వెళ్లి నడిచి వస్తున్నాడు. వెనుక నుంచి బైక్ వేగంగా ఢీ కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ద్వి చక్ర వాహన దారుడు అక్కడ నుంచి వేగంగా వెళ్లిపోయాడు. తమ తోటి కూలీ ఎంతకు తిరిగి రాకపోవడంతో రోడ్డు వెంట వెతకగా వీరేందర్ అచేతనంగా పడి ఉండటాన్ని చూశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని గుర్తించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారకుడు రాయనపేట వాసిగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడనుంది.

రాజారాంపేట సొసైటీ అధ్యక్షుడి మృతి

నేలకొండపల్లి, జనవరి 23: మండల పరిధిలోని రాజారాంపేట సొసైటీ అధ్యక్షుడు పగిడిపత్తి శ్రీను(45)సోమవారం రాత్రి మృతి చెందారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడున్నాడు. శ్రీను రాజారాంపేట సొసైటీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మృతుడు బీఆర్ఎస్ నాయకునిగా ఉన్నారు. శ్రీను మృతి సమాచారం తెలుసుకున్న పాలేరు మాజీ శాసనసభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి చెర్వుమాధారం వచ్చి శ్రీను మృతదేహంపై పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. శ్రీను మృతి సమాచారం తెలుసుకున్న పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది ఆకుల శేఖర్, కనమర్లపూడి రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ఉన్నం బ్రహ్మయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జడ్పీఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, సొసైటీల అధ్యక్షులు రాంబ్రహ్మం నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని భర్త ఆత్మహత్య

రఘునాథపాలెం, జనవరి 23: ఇంట్లో జరిగిన గొడవపై భార్య మహిళా పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిందని క్షణికావేశంలో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన రఘునాథపాలెం మండలంలో చోటు చేసుకొంది. ఎస్ఐ కొండల్‌రావు తెలిపిన వివరాలు మేరకు.. పాపటపల్లికి చెందిన రేగల్ల సైదులు(40) కామంచికల్‌కు చెందిన ఉషను రెండో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక పాప జన్మించింది. అయితే గత కొద్దికాలంగా భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నా యి. ఈ క్రమంలో సైదులు భార్యను కొట్టటంతో పుట్టింటికి వెళ్లింది. అక్కడ నుంచి ఖమ్మం మహిళా పోలీసుస్టేషన్‌కు వెళ్లి భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై మరోసారి భార్య భర్తల మధ్య గొడవ జరిగి ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని సైదులు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీప బంధువుల సమాచారంతో సైదులు తమ్ముడు రేగళ్ల పుల్లయ్య రఘునాథ పాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏ విద్యార్థి అనారోగ్యం బారినబపడొద్దు

● జిల్లా ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ డీడీలు విజయలక్ష్మి, కస్తాల

సత్తుపల్లి రూరల్, జనవరి 23: ఒక్క విద్యార్థి కూడా అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ డీడీలు విజయలక్ష్మి, కస్తాల సత్యనారాయణ కోరారు. మంగళవారం రాత్రి వారు ఆకస్మికంగా ఎస్సీ వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థుల సిలబస్, పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు క్వాలిటీ విద్య అందేలా చూడడంతో పాటు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలనీ ఆదేశించారు. వారివెంట ఆయా వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

▸ మంత్రి తుమ్మలకు కాంట్రాక్టర్ల వినతి



తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 23: పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను ఇప్పించాలని నగరపాలకసంస్థ కాంట్రాక్టర్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన మంత్రిని కాంట్రాక్టర్లు కలిసి తొలుత పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పెండింగ్ బిల్లుల సమస్యను వివరించారు. ప్రత్యేక అభివృద్ధి నిదులతో (ఎస్‌డీఎఫ్) తాము నగరంలో అభివృద్ధి పనులు చేశామని, తమకు రూ.22కోట్లు బిల్లులు రావాలని తుమ్మలకు వినతిపత్రం ద్వారా తెలిపారు. అలాగే గతంలో చేసిన పనులకు సంబంధించి తమకు బిల్లులు ఇచ్చేసమయంలో 10శాతం ఈఎండీ మినహాయించి, బిల్లులు చెల్లించారని, సదరు ఈఎండీ సొమ్ములను గత 4 ఏళ్లగా తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు, ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.10లక్షలనుండి రూ.15లక్షలు వరకు రావాల్సి ఉందని, వెంటనే ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మలను కలిసిన వారిలో పసుపులేటి వేంకటేశ్వర్లు, జుగల్ కిషోర్, తమ్మిశెట్టి వెంకట నారాయణ, శ్రీహరిరాజు, బండి సతీష్, కృష్ణ తదితరులున్నారు.

ఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి తుమ్మల

పట్టణ పేదరిక నిర్మూలనాసంస్థ (మెప్మా)లో పనిచేసే రిసోర్స్‌పర్సన్ల (ఆర్పీలు) సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. మంగళవారం తుమ్మల క్యాంప్ కార్యాలయంలో ఆర్పీలు ఆయనను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తమకు నెలకు కేవలం రూ.4వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారని, అయితే 8నెలలుగా వేతనాలు ఇవ్వటం లేదని ఆర్పీలు తుమ్మలకు వివరించారు. స్వయం సహాయక బృందాలకు ఇచ్చే రుణాలపై వచ్చేవడ్డీనే తమకు వేతనాలుగా చెల్లిస్తున్నారని, అలా కాకుండా ప్రభుత్వంనుంచి వేతనాలు వచ్చేలా చూడాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన తుమ్మల ఆర్పీల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి తుమ్మలను కలిసిన వారిలో మెప్మా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు బీ.ఉష, ఆర్పీలు ఉన్నారు.

సమస్యలపై భట్టికి వినతి

ముదిగొండ, జనవరి 23: మండలంలోని సమస్యలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన భట్టి విక్రమార్క మండలానికి ఒకరోజు కేటాయించి సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. భట్టిని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులు మల్లెల అజయ్, ఎల్లయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్ ఉన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

● పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 23: తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం కళాశాల, పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు వీటిని రైతులు ప్రజలు సద్వినియోగించుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో పశువైద్యానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా పథకం లో భాగంగా మధిర పరిసర ప్రాంతాల్లో ఫిబవరి 1నుంచి వారం రోజులు పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిపుణులైన అధ్యాపక బృందం పశువైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. పశువైద్య శిబిరాల నిర్వహణ కార్యక్రమాన్ని సిద్దినేని గూడెంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించనున్నట్లు తెలిపారు. పిండ మార్పిడి, రాజశ్రీ కోళ్ల పంపిణీ, ఖనిజ లవణాలమిశ్రమం, వివిధ రకాల వ్యాధులు చికిత్స ఫిబ్రవరి 1 నుంచి 7వరకు పశుగర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాలను నిర్వహించి సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య ప్రతిభ

మధిరటౌన్, జనవరి 23: జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో మధిర శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎ. భారతి అభినందించారు, జాతీయ స్థాయి ఒలింపియాడ్ క్యాట్ పరీక్ష లో ఐదుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్ సాదించగా మరో 15 మంది విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు సాదించారని అన్నారు. పాఠశాలలో ఉత్తమ బోధన ఫలితంగానే విద్యార్థులు ప్రతిభ కనపరిచి బహుమతులు పొందారని అన్నారు.

నిబంధనల ప్రకారమే ఓట్ల మార్పులు చేర్పులు

చింతకాని జనవరి 23: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా మార్పులు చేర్పులు ఉంటాయని ఆర్‌డీవో గణేష్ తెలిపారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో నివాసం ఉండని కొందరి ఓట్లను తొలగించాలంటూ సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందాయి. ఓట్ల మార్పులు చేర్పులకు సంబంధించి ఫిర్యాదులు అందడంతో ఆర్‌డీవో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇరుపక్షాలను పిలిచి వారితో మాట్లాడారు. నిబంధనల ప్రకారమే మార్పులు, చేర్పులు ఉంటాయని, క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహిస్తామని వారికి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, గిర్ధావర్ పగడాల ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిల రవికుమార్ నివాసానికి మంత్రి తుమ్మల

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 23: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొదిల రవికుమార్ నివాసానికి మంగళవారం వెళ్లారు. రవికుమార్‌తో కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు. తర్వాత కల్లూరి సోమనాథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రీటౌన్ ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల పాల్గొన్నారు. నాయకులు మానుకొండ రాధాకిషోర్, సాధు రమేశ్‌రెడ్డి, వడ్డెబోయిన నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సంఘ నాయకుల వ్యాఖ్యలు సరికాదు

● నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసిన టీఎన్జీవో నేతలు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న టీఎన్జీవో నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 23: ప్రభుత్వ ఉద్యోగులదేవాలయంగా భావించే యూనియన్ కార్యాలయాన్ని తప్పుడుగా ప్రచారం చేస్తూ మాజీ సంఘం నాయకులు దిగజారుడు తనానికి నిదర్శనమని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ అఫ్జల్‌హాసన్, ఆర్వీఎస్ సాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎన్జీవో జిల్లా సంఘం పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గత మాజీ సంఘం నాయకులు విచక్షణ కోల్పోయి మహిళా ఉద్యోగులను అసభ్య పదజాలంతో చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ వారు డిమాండ్ చేశారు. 45 రోజులుగా యూనియన్ కార్యాలయానికి తాళం వేయడం వలన 100 మంది ఉద్యోగుల ఎస్సార్ కార్యాలయంలో నిలిచాయని ఉద్యోగులు పెన్షనర్లు మానసికంగా క్షోభకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో షేక్ నాగుల్‌మీరా, కట్టా నవీన్, సాయిశిరిణ్మయి, వెంకట్‌రెడ్డి, సువర్ణన్ పాల్, బుద్దా రామకృష్ణ, వై శ్రీనివాసరావు, శాబాసు జ్యోతి, ఈ స్వప్న, శివనాగ స్వప్న, నళిని సౌజన్య సరోజని లక్ష్మీ, అరుణ వసంత శాంతకుమారి పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న రామనాథం

వైరా/మధిరరూరల్, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం వైరా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు కేక్ కట్‌చేశారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్, నాయకులు మందడపు మధుసూదన్‌రావు, మేదరమెట్ల పూర్ణచంద్రరావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, మద్దిని రామారావు, స్రవంతి, లోకవరపు అయ్యప్ప, బోడేపూడి మురళీ, మన్నెం ప్రసాద్, కూరపాటి రమేష్, జానీ, సంగీతం సైదులు పాల్గొన్నారు.

మధిర రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల కేక్‌ను ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లాది హన్మంతరావు, చేకూరి శేఖర్‌బాబు, యలమంచిలి శివ, మేడేపల్లి రాణి, చెరుకూరి కృష్ణారావు, పాశం రామనాథం, స్వామినాయుడు, దేవభక్తిని వెంకట్, మేడా వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఉపేంద్ర, చటారి మునలి, గడ్డం రమేష్, షైనీడి జగన్, చావా రాము, అనుమోలు సతీష్, వాసిరెడ్డి ప్రకాశరావు, అంగడాల పార్వతీ, వడ్లమూడి సాయి, బెల్లంకొండ రామకోటయ్య, చట్టు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ప్రత్యేక పోలీసు బృందాలు

నేర సమీక్షలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



మాట్లాడుతున్న కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం క్రైం, జనవరి 23: చట్టవ్యతిరేక కార్యకలాపాలను చెక్ పెట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. నగరంలోని పోలీస్ కాన్ఫ రెన్స్ హాల్లో మంగళవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరి రక్షణ చాలా ముఖ్యమన్నారు. మత్తుపదార్థాల రవాణా, విక్ర యాలు, వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మో పుతోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మాదకద్రవ్యాల సరఫరా, దాని మూలాలకు సం బంధించిన అన్ని లింకులను గుర్తించి కట్టడిచేసేలా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేసినట్లు తెలిపారు. బ హిరంగ మద్యపానం, ఇతరులకు ఇబ్బంది కలిగిం చడం, రాష్‌డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించి షాపులు తెరవడం, పనిలేకున్నా రోడ్లపై రావడం, పుట్టినరోజు వేడుకలు రోడ్లపై వాహనాలు అడ్డంపెట్టి ప్రజలకు అసౌకర్యం కటిగించే వారిపై సిటీ పోలీసు యాక్టు కచ్చితంగా అమలుచేసి కోర్టులో హాజరుపరచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు గణేష్ ప్రసన్నకుమార్, హరికృష్ణ, బస్వారెడ్డి, రహెమాన్, రామానుజం, సారంగపాణి, కృపాకర్, రవి, శివరామయ్య, శంకర్, నర్సయ్య, సునీల్‌సింగ్ పాల్గొన్నారు.

కథల పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయం

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 23: 'అక్షరాల తోవ' ఆరవ వార్షికోత్సవం సందర్భంగా వారం వారం నిర్వహించిన కవితల పోటీలలో బహుమతులు పొందిన కథలు, కవితల ముద్రణకు నగరంలోని ఎన్ఎస్‌సీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు యలమద్ది వెంకటేశ్వర్లు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శంకరావు ఆధ్వర్యంలో చెక్కును సంస్థ బాధ్యులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ళ ఉపేందర్‌కు అందించారు. దాత వైవీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ సఫి, ఉరిమళ్ళ సునంద, వెంకటేశ్వర్లు తదతరులు పాల్గొన్నారు.

ప్రాణం కన్నా వేగం ముఖ్యం కాదు

● సత్తుపల్లి ఎంవీఐ వెంకటపుల్లయ్య

సత్తుపల్లి, జనవరి 23: రోడ్డుపైకి వచ్చినపుడు గమ్యానికి చేరుకునే క్రమంలో ప్రాణం కన్నా వేగం ముఖ్యం కాదని సత్తుపల్లి రవాణాశాఖాధికారి వెంకటపుల్లయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంవీఐ వెంకటపుల్లయ్యను డిపో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితి, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

రాష్ట్ర వైజ్ఞానిక ప్రదర్శనలకు 'మధు' విద్యార్థుల ఎంపిక

వైరా, జనవరి 23: రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలకు వైరాలోని మధు విద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో మధు విద్యాలయానికి చెందిన విద్యార్థులు జూనియర్ విభాగంలో మల్లెంపాటి ధమన్, సీనియర్ విభాగంలో ధనలకోట వైష్ణవివర్మ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. వీరి ప్రదర్శనలతో రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికయ్యారు. విద్యార్థులను మధు విద్యాలయ చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు, కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్, కోశాధికారి నర్మద, ఉపాధ్యక్షుడు మల్లెంపాటి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు డీఐఆర్.చారి, రాజేంద్రప్రసాద్, ఆర్‌వీ.రామకృష్ణ అభినందించారు.

అయోధ్య బాలరాముడిని దర్శించుకున్న వైరా వాసులు

వైరా, జనవరి 23: వైరాకు చెందిన రామభక్తులు మంగళవారం అయోధ్యలోని బాలరాముడిని దర్శించుకున్నారు. రామమందిర నిర్మాణ రూపకర్త శ్రీరామభద్రాచార్యులకు వైరాకు చెందిన నంబూరు కుటుంబసభ్యులు రామానుజ విగ్రహాన్ని బహూకరించారు. గత వారంరోజుల నుంచి అయోధ్య రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు వైరాకు నంబూరు కుటుంబసభ్యులు బయల్దేరి వెళ్లారు. చివరికి మంగళవారం ఈ ఆలయాన్ని దర్శించుకున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్న ఆర్‌సీవోను సస్పెండ్ చేయాలి

వైరా, జనవరి 23: సాంఘీక సంక్షేమ గురుకులాల్లో పర్యవేక్షణ చేయకుండా విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్న ఆసంస్థ ఆర్‌సీవోను సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. వైరాలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను ఈ సంఘాల నాయకులు మంగళవారం సందర్శించి దర్నా చేశారు. ఈ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని కొంగల ప్రసన్న పాముకాటుకు గురై ఖమ్మంలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఈ మూడు సంఘాల ప్రతినిధులు గురుకులాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఆసంస్థ ఖమ్మం ఆర్‌సీవో ప్రత్యూష గురుకులాల సందర్శన చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని, పాముకాటుకు గురైన ప్రసన్నకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు చింతల రమేష్, కోట ప్రేమ్‌కుమార్, గుడిమెట్ల రజిత, చిత్తారు మురళీ, భూక్యా విజయబాయి పాల్గొన్నారు.

పలువురి నేత్రదానం

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 23: అయిన వారిని కోల్పోయిన పుట్టెడు శోకంలోనూ మృతుల నేత్రాలను దానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు వారి కుటుంబీకులు, బంధువులు. జిల్లాలో సోమ, మంగళవారం సత్తుపల్లికి చెందిన బనాపురి మాణిక్యమ్మ (70), పల్లిపాడుకు చెందిన మిట్టపల్లి సీతారాములు (58), సత్తుపల్లికి చెందిన దాసరి పుష్పావతి (82), నల్గొండకు చెందిన శ్రావణ్‌కుమార్ (51), పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన గంజి సుబ్బలక్ష్మీ (52), పీసీకే తోటకు చెందిన కొత్తూరు రంగమ్మ (69), జహీర్‌పుర కు చెందిన బూసా పద్మావతి (75), సత్తుపల్లికి చెందిన జంగాల సీతామహాలక్ష్మీ (67) జగ్గయ్యపేటకు చెందిన పల్లెపాటి రాజ్యం (67) మృతి చెందారు. మృతుల నేత్రాలను వారి కుటుంబీకులు ఖమ్మం నేత్రనిధికి దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్, అగర్వాల్, వాసన్ నేత్రనిధికి పంపించినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్‌ఏ పద్మనాభం తెలిపారు.

భేషజాలు లేకుండా అభివృద్ధి చేసుకుందాం

▸ వైరా నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సమీక్ష

వైరా, జనవరి 23: ఎవరు ఎలాంటి భేషజాలకు పోకుండా నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేసుకుందామని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం రైతుశిక్షణ భవన్‌లో మంగళవారం వైరా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో తొలిసారి సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో చేసిన తప్పిదాలను అధికారులు పునరావృతం కానివ్వొదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులందరూ సమగ్రాభివృద్ధికి విధిగా పాటుపడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి ప్రజాప్రతినిధులుగా తామందరం అండగా ఉంటామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైరా నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వారి తోడ్పాటుతో విద్యా, వైద్యం, రహదారులు, రవాణా రంగం, నీటిపారుదల, విద్యుత్, వ్యవసాయ అభివృద్ధిలో వైరా నియోజకవర్గాన్ని ముందు భాగాన నిలుపుదామని అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీ స్కీంలైన అభయహస్తాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులకు లబ్ధిచేకూరేలా చూడాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని కారేపల్లి, జూలూరుపాడ్, ఏన్కూరు, కొణిజర్లలోని పోడుభూముల సమస్యపై అటవీశాఖ అధికారులు నివేదించారు. పోడుసాగురైతులను ఇబ్బందిపెడితే సహించబోనని ఎమ్మెల్యే హెచ్చరించారు. మిగిలిన అన్నిశాఖలపై సమీక్ష చేశారు. కల్లూరు ఆర్డీవో అశోక్‌చక్రవర్తి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఏడీఏ వి.బాబూరావు సహా అన్నిప్రభుత్వశాఖల అధికారులు సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే, హాజరైన అధికారులు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఏన్కూరు: ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం రిటైర్డు ఉద్యోగులు విశేషంగా కృషిచేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు,ఏబ్లాక్ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, నాయకలు చందమామ నరసింహారావు, పూర్ణకంటి మైసారావు, మేడ దర్మారావు, కొప్పుల ప్రబావతిరెడ్డి, రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్బయ్య, తోట రామచంద్రయ్య, ఆవుల నరసయ్య, భూక్యా చందులాల్‌నాయక్, హరిలాల్ నాయక్, బాబులాల్‌నాయక్ పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై పట్టుసాదించాలి

ఆంగ్లబాషపై విద్యార్థులు పట్టుసాదించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి సెల్ఫ్ విజార్డ్ ఇంగ్లీష్ స్కూల్ లెవల్ కాంపిటీషన్‌ను ప్రారంభించారు. అనంతరం రాగిజావ తాగి సంతృప్తి వ్యక్త చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కూరాకుల సైదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షిరిడీ సాయినాధుడికి ఖమ్మం చిన్నారుల నృత్య నీరాజనం

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 23: షిరిడీ సాయి బాబా సన్నిధిలో మంగళవారం రాత్రి ఖమ్మం అభినయ రుద్ర నాట్యాలయ చిన్నారులు సాయిబాబాకు నృత్య నీరాజనం సమర్పించారు. నాట్యాలయ గురువు కణతాల ఫణిల్ పర్యవేక్షణలో సుమారు 30 మంది కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



